# నవతరం
నేటితరం కోసం...


హైదరాబాద్ | సోమవారం, జనవరి 5, 2026 | సంపుటి:11 | సంచిక : 256 | పేజీలు: 8 | వెల : రూ.5




మదురో
అరెస్ట్‌పై భారత్ ఆందోళన..

చర్చలతోనే పరిష్కారమని సూచన

# కృష్ణా నీళ్లపై అసత్యాల రాజకీయం



ప్రాజెక్టులపై నిర్లక్ష్యానికి కాంగ్రెస్ కుట్రే కారణం: హరీశ్‌రావు

అసెంబ్లీలో సీఎం చెప్పింది వాస్తవాలు కావని బీఆర్ఎస్ ఆరోపణ

తెలంగాణ జలహక్కులను తాకట్టు పెట్టిందని కాంగ్రెస్‌పై విమర్శలు

పాలమూరు, నల్లగొండకు అన్యాయం జరిగినదీ విభజన కాలంలోనేనన్న వాదన

కృష్ణాగోదావరి అంశాల్లో లోపాయికారి ఒప్పందాలపై అనుమానాలు

ప్రాజెక్టుల నిర్వాహణలో కక్షపూరిత వైఖరి ఉందన్న ఆరోపణ

కాంగ్రెస్ పాలన వల్లే నేటి నీటి సమస్యలంటూ విమర్శ

హైదరాబాద్, జనవరి 4: కృష్ణా జలాల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వాస్తవాలను వక్రీకరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, రాష్ట్రానికి తీరని నష్టం వాటిల్లేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. నల్లగొండ జిల్లాకు నష్టం కలిగించిన నిర్ణయాల వెనుక కాంగ్రెస్ పాత్రే ఉందని ఆయన వ్యాఖ్యానించారు.తెలంగాణ భవన్‌లో కృష్ణా జలాలపై బీఆర్ఎస్ నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో తీసుకున్న నిర్ణయాలతోనే తెలంగాణకు అన్యాయం జరిగిందని, కీలక ప్రాజెక్టులకు చట్టపరమైన రక్షణ కల్పించడంలో అప్పటి పాలకులు విఫలమయ్యారని చెప్పారు. పాలమూరురంగారెడ్డి, డిండి వంటి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ తన తప్పులను దాచిపెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.ప్రస్తుత ప్రభుత్వం కాళేశ్వరం సహా ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రాజెక్టుల అమలును ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తూ రైతుల ప్రయోజనాలను పక్కనపెడుతోందన్నారు. కాంగ్రెస్ పాలన కాలంలో పరిమిత ప్రాంతాలకు మాత్రమే నీరు అందిందని, బీఆర్ఎస్ హయాంలో సాగునీటి విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని

(మిగతా 2వ పేజీలో)

# గోదావరి జలహక్కుల పరిరక్షణకు తెలంగాణ న్యాయపోరాటం

గోదావరిపై ఏపీ విస్తరణ యత్నాలకు అడ్డుకట్టే లక్ష్యంగా చర్యలు

సర్వోన్నత న్యాయస్థానంలో తెలంగాణ రిట్‌పై కీలక విచారణ

న్యాయపరంగా బలమైన వాదనలు వినిపించాలని నిపుణులకు సూచన

అనుమతుల్లేని పనులు తక్షణమే నిలిపివేయాలన్న డిమాండ్

కేంద్ర సంస్థలు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్న విజ్ఞప్తి

తెలంగాణ ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రాధాన్యం : సీఎం రేవంత్



హైదరాబాద్, జనవరి 4:గోదావరి నదిలో తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను కాపాడుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం దృఢమైన చర్యలకు సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు నీటి తరలింపు యోజనను అడ్డుకునేందుకు న్యాయపోరాటాన్ని మరింత ఉధృతం చేసింది. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్ సర్వోన్నత న్యాయస్థానంలో సోమవారం

(మిగతా 2వ పేజీలో)


## కృష్ణా జలాలపై త్వరలో అన్ని విషయాలు మాట్లాడతా: సీఎం చంద్రబాబు



రాయలసీమ లిఫ్ట్ పనులను ఆపింది తానేనని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్య

రేవంత్ వ్యాఖ్యలతో  చెలరేగిన దుమారం

కృష్ణా జలాలపై త్వరలోనే వాస్తవాలు వివరిస్తానన్న సీఎం చంద్రబాబు



## పోలీసు అధికారుల తీరుపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

సెర్చ్ వారెంట్లు జారీ చేసే అధికారం పోలీసులకు ఎక్కడదని ప్రశ్నించిన హైకోర్టు

ఏ నిబంధనలు, ఏ జీవో ఆధారంగా చేస్తున్నారో వివరాలు సమర్పించాలన్న హైకోర్టు

తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా



## గ్రోక్‌పై కేంద్రం సీరియస్.. 72 గంటల గడువు

'గ్రోక్' ఏఐతో అశ్లీల కంటెంట్ వ్యాప్తిపై కేంద్రం సీరియస్

ఎలాన్ మస్క్ 'ఎక్స్' యాజమాన్యానికి 72 గంటల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

కంటెంట్‌ను తొలగిస్తున్నామని స్పష్టం చేసిన ఎక్స్


నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

స్థానిక ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తామన్న యాజమాన్యం




# కృష్ణా నీళ్లపై అసత్యాల రాజకీయం

హైదరాబాద్, జనవరి 4: కృష్ణా జలాల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వాస్తవాలను వక్రీకరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, రాష్ట్రానికి తీరని నష్టం వాటిల్లేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. నల్లగొండ జిల్లాకు నష్టం కలిగించిన నిర్ణయాల వెనుక కాంగ్రెస్ పాత్రే ఉందని ఆయన వ్యాఖ్యానించారు.తెలంగాణ భవన్‌లో కృష్ణా జలాలపై బీఆర్ఎస్ నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో తీసుకున్న నిర్ణయాలతోనే తెలంగాణకు అన్యాయం జరిగిందని, కీలక ప్రాజెక్టులకు చట్టపరమైన రక్షణ కల్పించడంలో అప్పటి పాలకులు విఫలమయ్యారని చెప్పారు. పాలమూరురంగారెడ్డి, డిండి వంటి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ తన తప్పులను దాచిపెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.ప్రస్తుత ప్రభుత్వం కాళేశ్వరం సహా ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రాజెక్టుల అమలును ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తూ రైతుల ప్రయోజనాలను పక్కనపెడుతోందన్నారు. కాంగ్రెస్ పాలన కాలంలో పరిమిత ప్రాంతాలకు మాత్రమే నీరు అందిందని, బీఆర్ఎస్ హయాంలో సాగునీటి విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని గణాంకాలు ప్రస్తావించారు.కృష్ణా జలాలపై గతంలోనే కేంద్రాన్ని నిలదీసినట్టు గుర్తు చేస్తూ, టెలిమెట్రీ వంటి వ్యవస్థలను అమలు చేయడంలో తమ ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం అసెంబ్లీలో ఎంపిక చేసిన సమాచారాన్నే చదువుతూ సభ్యులను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. గోదావరిబనకచర్ల ప్రాజెక్టుపై అనుమానాస్పద ఒప్పందాలు కుదిరాయని కూడా ఆయన వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ దశాబ్దాల పాలన వల్లే నేటి నీటి వివాదాలు ఉత్పన్నమయ్యాయని హరీశ్‌రావు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ నీటి వినియోగం, ప్రాజెక్టుల వేగవంతమైన నిర్మాణం జరిగిందని తెలిపారు. తెలంగాణ



ప్రయోజనాల కోసం తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ కూడా మాట్లాడుతూ, నదీ జలాల విషయంలో కాంగ్రెస్ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. జలాలపై అవగాహన లేకుండానే ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేస్తున్నారని, రాజకీయ దూషణలతో వాస్తవాలు మారవని వ్యాఖ్యానించారు.

# కృష్ణా జలాలపై త్వరలో అన్ని విషయాలు మాట్లాడతా: సీఎం చంద్రబాబు

### రాయలసీమ లిఫ్ట్ పనులను ఆపింది తానేనని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్య

### రేవంత్ వ్యాఖ్యలతో చెలరేగిన దుమారం

### కృష్ణా జలాలపై త్వరలోనే వాస్తవాలు వివరిస్తానన్న సీఎం చంద్రబాబు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృష్ణా నదీ జలాల వివాదంపై చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ దుమారం రేపాయి. తన విజ్ఞప్తి మేరకే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమ ఎత్తిపోతల పథకం (ఆర్ఎల్ఐఎస్) పనులను నిలిపివేశారని రేవంత్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో ప్రకటించడం ఈ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. "నా మీద ఉన్న గౌరవంతో చంద్రబాబు ఆ పనులు ఆపేశారు" అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.ఈ నేపథ్యంలో, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వివాదంపై స్పందించారు. కృష్ణా జలాల విషయంలో అసలు ఏం జరిగిందో త్వరలోనే మీడియా ద్వారా అన్ని వాస్తవాలు వివరిస్తానని ఆయన తెలిపారు. చంద్రబాబు వివరణ తర్వాత ఈ వివాదం ఎలాంటి మలుపు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# మదురో అరెస్ట్‌పై భారత్ ఆందోళన..

## చర్చలతోనే పరిష్కారమని సూచన

**వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్ట్ చేసిన అమెరికా సైన్యం**

**నార్కో టెర్రరిజం ఆరోపణలపై విచారణకు న్యూయార్క్‌కు తరలింపు**

**తాత్కాలిక అధ్యక్షురాలిగా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ నియామకం**

**వెనెజువెలా పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేసిన భారత ప్రభుత్వం**

**చర్చల ద్వారా శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపు**



వెనెజువెలా: వెనెజువెలాలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అమెరికా డెల్టా దళాలు శనివారం అరెస్ట్ చేశాయి. వెనెజువెలాలోని ఓ సైనిక స్థావరంపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నాయి. అనంతరం వారిని యుద్ధనౌక ద్వారా న్యూయార్క్‌కు తరలించాయి. మదురోపై అమెరికా తీవ్రమైన నార్కో టెర్రరిజం ఆరోపణలు మోపింది. గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, భారీ పరిమాణంలో కొకైన్‌ను అమెరికాకు తరలించారని ఫెడరల్ కోర్టులో అభియోగాలు దాఖలు చేశారు. 1999 నుంచి 2025 వరకు సాగిన ఈ అక్రమ రవాణాకు మదురో నాయకత్వం వహించారని యూఎస్ అటార్నీ జనరల్ పామ్ బాండీ వెల్లడించారు. ఈ కేసులో మదురో భార్య, కుమారుడితో పాటు పలువురు ఉన్నతాధికారుల పేర్లను కూడా చేర్చారు. ప్రస్తుతం మదురో న్యూయార్క్‌లోని ఫెడరల్ జైలులో ఉన్నారు.మదురో అరెస్ట్ నేపథ్యంలో వెనెజువెలా సుప్రీంకోర్టు ఆదివారం కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశ పరిపాలనలో అంతరాయం కలగకుండా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌ను తాత్కాలిక అధ్యక్షురాలిగా నియమించింది. దేశ సమగ్రత, పరిపాలనా కొనసాగింపునకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోర్టు పేర్కొంది.వెనెజువెలా పరిణామాలపై భారత్ ఆందోళనఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెనెజువెలాలో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. సంబంధిత పక్షాలన్నీ చర్చల ద్వారా శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది. కరాకస్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.



# పోలీసు అధికారుల తీరుపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

### సెర్చ్ వారెంట్లు జారీ చేసే అధికారం పోలీసులకు ఎక్కడదని ప్రశ్నించిన హైకోర్టు

### ఏ నిబంధనలు, ఏ జీవో ఆధారంగా చేస్తున్నారో వివరాలు సమర్పించాలన్న హైకోర్టు

### తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా

తెలంగాణలో పోలీసుల చర్యలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పోలీస్ అసిస్టెంట్ కమిషనర్, కమిషనర్ స్థాయి అధికారులు తమంతట తాముగా సెర్చ్ వారంట్లు జారీ చేస్తుండటాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మోహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. సెర్చ్ వారంట్లు జారీ చేసే అధికారం పోలీసులకు ఎక్కడిదని హైకోర్టు ఈ సందర్భంగా ప్రశ్నించింది. పిటిషనర్ విజయగోపాల్ వ్యక్తిగత హోదాలో వాదనలు వినిపిస్తూ.. సీఆర్పీసీ సెక్షన్ 93, హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ సెక్షన్ 47లను పోలీసులు దుర్వినియోగం చేస్తున్నారన్నారు. జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లకు మాత్రమే ఉన్న అధికారాలను వినియోగిస్తూ కార్డన్ అండ్ సెర్చ్ పేరుతో తనిఖీలు చేపడుతున్నారని తెలిపారు. నేరస్థులు, అక్రమ వలసదారుల కోసం అంటూ సెర్చ్ వారంట్ లేకుండానే ఇళ్లలోకి ప్రవేశించి గుర్తింపు పత్రాలు అడుగుతున్నారని ఆరోపించారు.వాదనలు విన్న ధర్మాసనం, సీఆర్పీసీ లేదా బీఎన్ఎస్‌లోని ఏ నిబంధనలు, జీవోల ఆధారంగా పోలీసులు సెర్చ్ వారంట్లు జారీ చేస్తున్నారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ప్రజాభద్రత నిమిత్తం పోలీసులు చేస్తున్న కృషిని అభినందించాల్సిందేనని వ్యాఖ్యానిస్తూ.. సెర్చ్ వారంట్లు జారీ చేసే అధికారం పోలీసులకు ఉందా లేదా అన్న అంశంపై ఆధారాలతో సహా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# గోదావరి జలహక్కుల పరిరక్షణకు తెలంగాణ న్యాయపోరాటం

**గోదావరిపై ఏపీ విస్తరణ యత్నాలకు అడ్డుకట్టే లక్ష్యంగా చర్యలు**

**సర్వోన్నత న్యాయస్థానంలో తెలంగాణ రిట్‌పై కీలక విచారణ**

**న్యాయపరంగా బలమైన వాదనలు వినిపించాలని నిపుణులకు సూచన**

**అనుమతుల్లేని పనులు తక్షణమే నిలిపివేయాలన్న డిమాండ్**

**కేంద్ర సంస్థలు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్న విజ్ఞప్తి**

**తెలంగాణ ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రాధాన్యం : సీఎం రేవంత్**

హైదరాబాద్, జనవరి 4:గోదావరి నదిలో తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను కాపాడుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం దృఢమైన చర్యలకు సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు నీటి తరలింపు యోజనను అడ్డుకునేందుకు న్యాయపోరాటాన్ని మరింత ఉధృతం చేసింది. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్ సర్వోన్నత న్యాయస్థానంలో సోమవారం విచారణకు రానుంది.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆదివారం ముంబైలో ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో విస్తృతంగా చర్చించారు. కోర్టులో తెలంగాణ వాదనలను బలంగా వినిపించాలని, ఏపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న విస్తరణ చర్యలను స్పష్టంగా వివరించాలని సీఎం సూచించారు. సాంకేతిక అంశాలపై పూర్తి సమాచారం సిద్ధంగా ఉంచాలని ఇరిగేషన్ శాఖ అధికారులను కూడా ఆదేశించారు.పోలవరం ప్రాజెక్టుకు మొదట అనుమతించిన రూపకల్పనను మార్చి, నల్లమల సాగర్‌కు లింక్ చేసే ప్రయత్నాలు చట్ట విరుద్ధమని తెలంగాణ ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది. అనుమతులు లేకుండానే చేపడుతున్న ఈ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరింది. అలాగే తెలంగాణ అభ్యంతరాలను పక్కనపెట్టి కేంద్ర సంస్థలు ముందుకు సాగడం సరికాదని స్పష్టం చేసింది.కేంద్ర జలసంఘం, గోదావరి నది యాజమాన్య బోర్డు ఈ వ్యవహారంపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, పర్యావరణ అనుమతులు గానీ, ఆర్థిక సహాయం గానీ అందకుండా చూడాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ నిర్ణయానికీ తాము ఒప్పుకోమని ప్రభుత్వం స్పష్టం చేసింది.ముంబై సమావేశం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగివచ్చారు.

# తెలంగాణలో డ్వాక్రా బకాయిలపై సర్కార్ ఉక్కుపాదం.. కట్టకపోతే ఆస్తులు జప్తు!

**స్త్రీనిధి రుణ బకాయిలపై ప్రభుత్వం కఠిన నిర్ణయం**

**వసూళ్ల కోసం రెవెన్యూ రికవరీ చట్టం అమలుకు ఉత్తర్వులు**

**అప్పు కట్టని వారి ఆస్తులు జప్తు చేసి వేలం వేసే అధికారం**

**సభ్యురాలు కట్టకపోతే గ్రూప్‌లోని అందరిపైనా భారం**

హైదరాబాద్, జనవరి 4: తెలంగాణలో డ్వాక్రా సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా 'స్త్రీనిధి' ద్వారా రుణాలు పొంది, నెలవారీ వాయిదాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై కఠిన చర్యలకు సిద్ధమైంది. పేరుకుపోయిన మొండి బకాయిల వసూలు కోసం ప్రభుత్వం తనకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 'రెవెన్యూ రికవరీ చట్టాన్ని' అమలు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది.ఏమిటీ 'రెవెన్యూ రికవరీ' చట్టం?ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను వసూలు చేసేందుకు ఈ చట్టాన్ని ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగిస్తారు. దీని ప్రకారం రుణం చెల్లించని వారి ఆస్తులను జప్తు చేసే అధికారం అధికారులకు లభిస్తుంది. ఇళ్లు, భూములు వంటి స్థిరాస్తులతో పాటు ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుని, వాటిని బహిరంగంగా వేలం వేస్తారు. ఆ వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వం తన బకాయి కింద జమ చేసుకుంటుంది. ఈ చట్టం అమలుతో బకాయిదారులపై ఒత్తిడి పెంచి, వసూళ్లను వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.జగిత్యాల జిల్లాలో తీవ్రమైన పరిస్థితిప్రస్తుతం జగిత్యాల జిల్లాలో ఈ సమస్య తీవ్రంగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 60 వేల మందికి పైగా డ్వాక్రా సభ్యులు ఉండగా, వారికి ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 475 కోట్ల రుణాలు అందించింది. చాలామంది మహిళలు తమ వ్యాపారాల కోసం రూ. 30 వేల నుంచి రూ. 3 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. అయితే, జిల్లాలో వసూలు కావాల్సిన రూ. 101 కోట్లకు గాను కేవలం రూ. 78 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. దాదాపు రూ. 23 కోట్లు మొండి బకాయిలుగా పేరుకుపోవడంతో ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.ఒక్కరు




కట్టకపోయినా అందరికీ చిక్కులు!ఈ చట్టంలో అత్యంత కీలకమైన అంశం ఒకటుంది. రుణం తీసుకున్న సభ్యురాలి పేరు మీద ఎలాంటి ఆస్తులు లేకపోతే, ఆ అప్పును తీర్చే బాధ్యత గ్రూప్‌లోని మిగిలిన సభ్యులపై పడుతుంది. అంటే, ఒకరు చేసిన పొరపాటుకు సంఘంలోని అందరూ బాధ్యత వహించాల్సి వస్తుంది. అవసరమైతే ఇతర సభ్యుల ఆస్తులను కూడా జప్తు చేసేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. ఈ నేపథ్యంలో, సంఘంలోని మహిళలు పరస్పర సహకారంతో సకాలంలో రుణాలు చెల్లించేలా చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.ఇప్పటికే సెర్ప్, మెప్మా అధికారులు గ్రామాల్లో పర్యటించి బకాయిల చెల్లింపుపై అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ స్పందన ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠినంగా వ్యవహరించనున్నట్లు డీఆర్డీఏ అధికారులు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ల నుంచి కూడా అనుమతులు రావడంతో, త్వరలోనే జప్తు ప్రక్రియ ప్రారంభం కానుందని తెలుస్తోంది.

# తెలంగాణకు నీటిశాపంగా మారిన సీఎం

## అవగాహనలేని పాలనతో రాష్ట్రాన్ని ముంచుతున్న రేవంత్

**నదీజలాలపై కనీస అవగాహన కూడా లేదన్న ఆరోపణ**

**అసెంబ్లీలో వాస్తవాలు వక్రీకరించారని కేటీఆర్ తీవ్ర విమర్శ**



హైదరాబాద్, జనవరి 4: నదీజలాల అంశంపై అవగాహన లేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని, అదే తెలంగాణకు అతిపెద్ద ప్రమాదంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. బేసిన్లు, నీటి నిర్వహణపై ప్రాథమిక జ్ఞానం కూడా లేకుండానే అసెంబ్లీలో వ్యాఖ్యలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. రాష్ట్రానికి తరతరాలుగా జరిగిన అన్యాయానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్‌దేనని స్పష్టం చేశారు.నదీజలాలపై చర్చ పేరుతో అసత్యాలను ప్రచారం చేస్తూ వాస్తవాలను దాచే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ అన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు నిజాలు తెలియజేయాలనే ఉద్దేశంతోనే మాజీ మంత్రి హరీశ్‌రావు బీఆర్ఎస్ తరఫున పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు. అధికార మదంతో సీఎం మాట్లాడుతున్న తీరు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు.తెలంగాణ వ్యవసాయానికి ఊపిరిపోసిన కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధాకరమని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కరువు ప్రాంతాలను సస్యశ్యామలం చేసిన నాయకుడిపై చిల్లర వ్యాఖ్యలు చేయడం ద్వారా సీఎం తన స్థాయిని తానే తగ్గించుకుంటున్నారని అన్నారు. ఇలాంటి మాటలు వింటే తెలంగాణ వాదుల హృదయాలు మండిపోతున్నాయని పేర్కొన్నారు.దశాబ్దాల కాంగ్రెస్ పాలన, ఆ తరువాతి చంద్రబాబు ప్రభుత్వాల వల్లే తెలంగాణ తీవ్రంగా నష్టపోయిందని కేటీఆర్ గుర్తు చేశారు. పదేళ్లలో రాష్ట్ర రూపురేఖలు మార్చిన బీఆర్ఎస్ నాయకత్వాన్ని అవమానించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.ఆరు గ్యారెంటీలు, వందల హామీల అమలులో ప్రస్తుత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రానికి వ్యతిరేక శక్తులకు తోడ్పడిన వ్యక్తి ఇప్పుడు ముఖ్యమంత్రిగా మారడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. విలువలు, సంస్కారం లేని రాజకీయ భాషను సీఎం ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు.తాము కూడా ప్రతిస్పందించగల సామర్థ్యం ఉన్నా, రాజకీయ సంస్కారాన్ని పాటిస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణకు జరిగిన నీటి అన్యాయానికి కాంగ్రెస్ పార్టీనే పూర్తి బాధ్యత వహించాలని ఆయన తేల్చిచెప్పారు.

# వెనిజులాపై అమెరికా సైనికదాడి అప్రజాస్వామికం

## వెనిజులా అధ్యక్షుడు మధురో అరెస్టుకు ఏఐవైఎఫ్ ఖండన

## దాడిని ఖండిస్తూ నిరసన ధర్నా.. ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి

హైదరాబాద్, నవతరం: బొలివేరియన్ రిపబ్లిక్ ఆఫ్ వెనిజులా దేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నీచంగా సార్వభౌమాధికార నియమాలను ఘోరంగా ఉల్లంగిస్తూ వైమానిక దురాక్రమణ దాడులకు పాల్పడి వెనిజులా దేశ అధ్యక్షుడు నికోలాస్ మధురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌లను అత్యంత దుర్మార్గ, చట్టవిరుద్ధ పద్ధతుల్లో అరెస్టు చేయదడాన్ని నిరసిస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మల్లాపూర్ ఎలీఫెంటా కూడలి వద్ద ప్లకార్డులు చేతబూని ట్రంప్ కు వ్యతిరేకంగా నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ... మూడో ప్రపంచ దేశమైన వెనుజులాపై అమెరికా సామ్రాజ్యవాద కుట్రలను వారు తీవ్రంగా ఖండించారు. ఆ దేశ ప్రజలచే ప్రజాస్వామ్యంగా ఎన్నికైన దేశాధ్యక్షుడిపై, ఆయన కుటుంబంపై ఇలాంటి బెదిరింపులు, అరెస్టులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు, మానవ హక్కులకు, ఐక్యరాజ్య సమితి నియమ, నిబంధనలకు దేశాల సార్వభౌమత్వాలను ఉల్లంగించడమని వారు అన్నారు. వెనిజులా ప్రజల తీర్పుతో ఏర్పడిన ప్రభుత్వాన్ని కూల్చివేయాలనే లక్ష్యంతో అమెరికా సామ్రాజ్యవాదం రాజకీయ, న్యాయ, సైనిక మార్గాల్లో సాగిస్తున్న దాడులేనని వారు విమర్శించారు.ప్రపంచంలో అత్యధిక చమురు నిక్షేపాలు కలిగిన దేశం వెనిజులా అని, ఆ నిల్వలను దోచుకోవాలనే నీచ కుట్రలతో, సహజ వనరులపై ఆధిపత్యం కోసం ఒక దేశ నాయకత్వాన్ని నేరస్తులుగా ముద్రవేసి అరెస్టు చేయాలనుకోవడం ఆధునిక వలసవాద దురహంకారానికి ప్రతిరూపమని తెలిపారు. ఇవి అధ్యక్షుడు మధురోపై జరిగిన వ్యక్తిగత దాడులు మాత్రమే కాదనీ, ఇవి మొత్తం వెనిజులా ప్రజలపై, వారి స్వాతంత్రంపై హక్కులపై జరిగిన దాడులని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు వెనిజులా ప్రజల పోరాట సంకల్పాన్ని బలహీనపరచలేవనీ, అంతర్జాతీయ సమాజం ఈ దుర్మార్గమైన అరెస్టు లను వెంటనే ఖండించాలన్నారు. వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో జోక్యాన్ని తక్షణమే ఆపాలనీ, ఆ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని,




భారత ప్రభుత్వం కూడా సామ్రాజ్యవాద ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వతంత్ర విదేశాంగ విధానాన్ని పాటించాలని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాద దౌర్జన్యానికి వ్యతిరేకంగా నిలిచే వెనిజులా ప్రజల పోరాటానికి ఏఐవైఎఫ్ సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తుందన్నారు. ప్రజల ఐక్యతతోనే ఈ దుర్మార్గ కుట్రలు ఓడిపోతాయని, అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ ప్రజల పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, శేఖర్, సురేందర్, మధు,పవన్, చందు ఏఐఎస్ఎఫ్ నేతలు మహేష్, ఆతీఫ్, దీపక్, వుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుపై అసెంబ్లీలో మాట్లాడిన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

నవతరం అశ్వారావుపేటరాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుపై అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ శాసనసభలో సమ గ్రంగా, స్పష్టంగా, ప్రజల పక్షాన గళమెత్తారు. గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా రూపొందించిన ఈ బిల్లు ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, భారత ప్రజాస్వామ్యంలో గ్రామ పంచాయతీలే ప్రాథమిక శక్తికేంద్రాలు అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వేగవంతం కావాలంటే పంచాయతీలకు ఆర్థిక స్వయం ప్రతిపత్తి, పరిపాలనా అధికారాలు, నిర్ణయ స్వేచ్ఛ తప్పనిసరిగా కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు.పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులోని ముఖ్య అంశాలను వివరించిన ఎమ్మెల్యే, ఈ బిల్లు ద్వారాగ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు చేరే విధానం బలోపేతం అవుతుందని,సర్పంచులు,




ఉపసర్పంచులు, వార్డు సభ్యుల పాత్ర మరింత విస్తరిస్తుందని,గ్రామాభివృద్ధి పనుల్లో ప్రజల పాల్గొనడం పెరుగుతుందని,నిర్ణయాలలో వేగం పెరిగి పనులు ఆలస్యం కాకుండా పూర్తయ్యే అవకాశాలు ఉంటాయని వివరించారు.ప్రత్యేకంగా అశ్వారావుపేట నియోజకవర్గంలో ఉన్న గిరిజన గ్రామాలు, అటవీ ప్రాంతాలు, దూర గ్రామాల పరిస్థితులను అసెంబ్లీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుద్ధ్యం, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు వంటి మౌలిక వసతులు ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ అవసరాలను తీర్చడంలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.అలాగే, పంచాయతీల ద్వారా అమలు చేసే ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. అవినీతి రహిత పాలన, పారదర్శకత, ప్రజలకు జవాబుదారీతనం ఈ సవరణ బిల్లుతో మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కూడా పంచాయతీల పాత్ర పెరగాల్సిన అవసరం ఉందని జారె ఆదినారాయణ అన్నారు. ఉపాధి హామీ పథకం, స్వయం సహాయక సంఘాలు, రైతు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలంటే స్థానిక సంస్థలకు అధికారం ఇవ్వాలని సూచించారు.పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతమైతేనే గ్రామాల్లో నిజమైన అభివృద్ధి కనిపిస్తుందని, పట్టణాలకు వలసలు తగ్గుతాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ చట్ట సవరణ బిల్లు గ్రామ పాలనలో ఒక చారిత్రాత్మక అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు.అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చేసిన ఈ ప్రసంగానికి అసెంబ్లీలోని పలువురు సభ్యులు మద్దతు తెలిపారు. గ్రామీణాభివృద్ధిపై ఆయన చూపిన అవగాహన, అనుభవం, ప్రజల పట్ల ఉన్న నిబద్ధతను సభ ప్రశంసించింది.ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలు కూడా తమ ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతూ, గ్రామాల అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న నిరంతర కృషి కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు. పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుపై ఆయన చేసిన ప్రసంగం గ్రామీణ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచే విధంగా ఉందని స్థానిక నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## నిమ్స్ లో వైద్యం పొందుతున్న వారిని పరామర్శించిన ఎమ్మెల్యే జారే

**నవతరం అశ్వారావుపేట:** హైదరాబాద్ నిమ్స్ హాస్పటల్లో చికిత్స పొందుతున్న ములకలపల్లి మండలానికి చెందిన పువ్వాల రఘుపతిని చంటి మేస్త్రి ని ములకలపల్లి మీసేవ నిర్వాహకుడు పర్సిక జగన్ తండ్రి గారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గారు భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తుల అంజి అందుబాటులో ఉన్న వైద్యులతో ఎమ్మెల్యే జారే గారు మాట్లాడుతూ పరిస్థితిపై ఎప్పటికప్పుడు తన సమాచారం అందించాలని తెలిపారు అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు ఎవరు అధైర్యపడవద్దని ఆయన అన్నారు.



## సైబర్ నేరగాళ్లు రైతులని టార్గెట్ చేస్తున్నారు

నవతరం అశ్వారావుపేట: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో ఒక రైతుకి ఫోన్ చేసి క్రాప్ లోన్ 20,000 కట్టాలి అవి కడితేనే రుణమాఫీ వస్తుంది అంటూ నమ్మ బలికిన సైబర్ నేరగాడు. ఆ రైతుకి ఫోన్ చేయడంతో ఆయన వెంటనే 20000 ఫోన్ పే చేసి ఆధార్ కార్డు నెంబర్ కూడా చెప్పమనడంతో ఇదంతా నిజం అనుకొని రైతు డబ్బులు పంపించి మోసపోయాడు... కనుక ఇలాంటి ఫోన్ కాల్స్ వస్తే రైతులు జాగ్రత్త పడగలరు బ్యాంకు వారు ఎవరైనా క్రాప్ లోన్ ఫోన్ పే లేదా ఆన్లైన్ ట్రాన్స్ఫర్ చేయమని అడగరు.. ఏదైనా ఉంటే బ్యాంకుకు వెళ్లి వాటి యొక్క లావాదేవీలు వివరాలు తెలుసుకోవాల్సి ఉంటుంది ..అంతే తప్ప మన లోన్లకు సంబంధించి ఫోన్లో ఎలాంటి డబ్బులు లేదా ఓటిపీలు ఎవరికీ పంపించవద్దు అని తెలియజేస్తున్నాము.



## కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

గజ్వేల్ / కుత్బుల్లాపూర్, నవతరం: మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు యువజన విభాగం అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పుట్టిన రోజు సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ని గజ్వేల్ లోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కేపీ వివేకానంద తో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.



## ఎమ్మెల్సీ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్, నవతరం: మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు యువజన విభాగం అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పుట్టిన రోజు సందర్భంగా శంభీపూర్ లోని వారి నివాసంలో పూల బోకె ఇచ్చి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు బీఆర్ఎస్ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.






# బొల్లారం పరిధిలోనే కొనసాగించాలి

**ఐడిఏ బొల్లారం పోలీస్ స్టేషన్ ను తరలించవద్దని**

**జిల్లా మంత్రికి వినతి అందజేసిన కాంగ్రెస్ నాయకులు**





బొల్లారం, నవతరం: బొల్లారం, జిహెచ్ఎంసీ 272 డివిజన్ ప్రజల తరపున కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పుల్లగూర్ల జైపాల్ రెడ్డి సమక్షంలో పుల్లగూర్ల నరేంద్ర సింహారెడ్డి ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ కు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం బొల్లారం పరిధిలో పనిచేస్తున్న ఐడిఎ బొల్లారం పోలీస్ స్టేషన్‌ను అమీన్‌పూర్ సర్కిల్‌కు మార్చే ప్రతిపాదనపై బొల్లారం ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని మంత్రి కి తెలియజేశారు. పోలీస్ స్టేషన్‌ను బొల్లారం పరిధిలోనే కొనసాగించాలని కోరారు. బొల్లారం ఒక సాంద్ర జనాభా కలిగిన పారిశ్రామి, నివాస ప్రాంతం కాగా, ఇక్కడ తరచుగా శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా భద్రతకు సంబంధించిన అంశాలు ఎదురవుతుంటాయి. ప్రస్తుతం ఉన్న ఐడిఎ బొల్లారం పోలీస్ స్టేషన్ ప్రజలకు తక్షణ సేవలు అందిస్తూ, మహిళల భద్రత, కార్మికుల సమస్యలు, పరిశ్రమలకు సంబంధించిన అంశాలు, వృద్ధుల రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నదని ప్రతినిధులు వివరించారు.

**పోలీస్ స్టేషన్‌ను ఆమేన్‌పూర్ సర్కిల్‌కు మార్చితే:**

- అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల స్పందన ఆలస్యం కావడం c ఫిర్యాదులు ఇవ్వడానికి ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగడం
- పరిధి స్పష్టత లేక శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం
- పరిశ్రమలు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఐడిఎ బొల్లారం పోలీస్ స్టేషన్‌ను బొల్లారం పరిధిలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా మంత్రి ని కోరారు. బొల్లారం ప్రజల న్యాయమైన సమస్యపై మంత్రి సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.


# బాడీబిల్డింగ్ ఆత్మవిశ్వాసం పెంచుతుంది

**ఎండీఆర్ ఫౌండేషన్**

**కో ఫౌండర్, బిఆర్ఎస్ నాయకులు పృథ్వీరాజ్**










పటాన్చెరు, నవతరం: పటాన్చెరు వేదికగా శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమర్ క్లాసిక్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ కార్యక్రమంలో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ స్పోర్ట్స్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ని పుష్పగుచ్ఛం అందజేసి ఎండీఆర్ ఫౌండేషన్ కో ఫౌండర్, బిఆర్ఎస్ నాయకులు పృథ్వీరాజ్ ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా దేశ నలుమూలల నుంచి వచ్చిన బాడీ బిల్డర్లు తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. యువత క్రీడల వైపు అడుగులు వేయాలని, ఆరోగ్యమే నిజమైన సంపద అని పృథ్వీరాజ్ పేర్కొన్నారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకర జీవనశైలిని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు.

# సుభాష్ నగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన





కుత్బుల్లాపూర్, నవతరం: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 292వ డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్‌లో డివిజన్ జనరల్ సెక్రటరీ ద్వారంపూడి నాగిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, పైప్‌లైన్ పనుల శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, సుభాష్ నగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడం వల్ల గత కొన్ని సంవత్సరాలుగా వర్షాకాలంలో జలముదుకులు, నీటి నిల్వ సమస్యలు తీవ్రంగా ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించాలనే లక్ష్యంతోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ పనులు పూర్తయిన తర్వాత డ్రైనేజ్ సమస్యలు, వర్షపు నీరు నిలిచిపోయే పరిస్థితులు గణనీయంగా తగ్గి, ప్రాంత ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన పరిస్థితులు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, అధికారులు మరియు కాంట్రాక్టర్లు నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేసేలా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు చేపడుతున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, ద్వారంపూడి నాగిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాలనీ వాసులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. హన్మంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ చేరికలు స్థానికంగా కాంగ్రెస్ పార్టీకి మరింత బలాన్ని చేకూర్చాయి. ఈ కార్యక్రమం లో డివిజన్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ద్వారంపూడి నాగి రెడ్డి, మహిళా ప్రెసిడెంట్ తులసి, అర్చన, భాస్కర్ రెడ్డి, హరికిరణ్, కరణ్ రాజు చారి, చందు, రాహుల్, బాలాజీ, జగదీష్, కొమరయ్య, ఆటో రవి, సలోమీ, మౌలాలి, శ్రీనివాస్, కృష్ణ, శంకర్, వినోద్, అశ్విన్, తదితరులు పాల్గొన్నారు.



**మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతి రెడ్డి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఉమ్మడి రంగారెడ్డి మాజీ జడ్పీ ఉపాధ్యక్షులు బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి, కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు.**

**- నవతరం, కుత్బుల్లాపూర్**




## మార్షల్ ఆర్ట్స్ కు హాజరైన మాద్రి

పటాన్చెరు, నవతరం: జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలకు హాజరై, క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడిన మాద్రి పృథ్వీరాజ్, మార్షల్ ఆర్ట్స్ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, స్వీయరక్షణను పెంపొందించే ఉత్తమ క్రీడ అని పేర్కొన్నారు. యువత క్రీడల వైపు దృష్టి సారించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ప్రతిభను వెలికి తీసి, దేశానికి గర్వకారణంగా నిలుస్తాయని తెలిపారు.



## మల్లన్న స్వామి జాతరలో.. మాద్రి పృథ్వీరాజ్

పటాన్చెరు, నవతరం: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో ఘనంగా నిర్వహించిన మల్లన్న స్వామి జాతర కార్యక్రమంలో ఎండీఆర్ ఫౌండేషన్ కో ఫౌండర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రాంత ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు. భక్తులతో ఆత్మీయంగా మమేకమై జాతర వైభవాన్ని మరింత పెంచారు.



**సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎమ్. రమేష్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి.**

**- నవతరం, సైబరాబాద్ / కుత్బుల్లాపూర్**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పరిధిలోని గాజులరామారం సర్కిల్ లో అంతులేని బహుళ అంతస్తుల భావన నిర్మాణాలు వెలుస్తున్నాయి. సదరు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేయాల్సిన అధికారులే అనధికారికంగా వసూళ్లకు పాల్పడుతూ తమ విధులనే మర్చిపోతూ.. ప్రజలచేత ఛీ.. అనిపించుకుంటున్నారు. సామాజిక కార్యకర్తలు అక్రమ నిర్మాణాలపై ఎన్ని ఫిర్యాదులు చేస్తున్నా దున్నపోతుమీద వాన పడ్డట్టు, తమకేమీ తెలియదన్నట్టు వ్యవహరిస్తూ.. బహుళ అంతస్తుల నిర్మాణదారుల అక్రమాలకు ఎలా వంతపాడుతున్నారు..? అనే అంశంపై 'నవతరం' తెలుగు దినపత్రిక ప్రత్యేక కథనం...

## కుత్బుల్లాపూర్
## జోనల్ కమిషనర్ పరిధిలో అక్రమ నిర్మాణాలు

**మున్సిపల్ చట్టాలకు వ్యతిరేకంగా 'బహుళ అంతస్తుల నిర్మాణాలు'**

**జీరో అనుమతులతో రెచ్చిపోతున్న నిర్మాణదారులు**

**పర్మిషన్ పల్లికాయంత.. నిర్మాణం నిమ్మకాయంత**

**నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్లతో మమ అనిపిస్తున్న అధికారులు**

**కలెక్షన్లే తప్ప యాక్షన్లు లేవంటున్న స్థానిక ప్రజలు**

**అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలంటున్న సామాజిక కార్యకర్తలు**




# గాజులరామారంలో
# అంతులేని అక్రమ నిర్మాణాలు

కుత్బుల్లాపూర్, జనవరి 4 (నవతరం): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ గాజులరామారం సర్కిల్ పరిధిలోని కైసర్ నగర్, గాజులరామారం, భూదేవి హిల్స్, కైలాస్ హిల్స్, జగద్గిరిగుట్ట, శిరిడీ హిల్స్, మల్లారెడ్డి నగర్, ద్వారక నగర్, మైసమ్మ నగర్, ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతీ ఒక కాలనీలో, ప్రతీ ఒక్క వార్డులో అక్రమ నిర్మాణాల కోరు కొనసాగుతుంది. దీనికి ప్రధాన కారణం ఒక చేత్తో అరకొర అనుమతులకు సంతకాలు పెడుతున్న అధికారులు మరో చేత్తో అక్రమ సంపాదనకు తెరలేపడమేనంటున్నారు స్థానిక ప్రజలు. కొందరు దళారులతో చేతులు కలిపిన కొందరు లంచగొండి అధికారులు అక్రమ నిర్మాణదారులకు కొమ్ము కాస్తున్నారు. అనుమతులకు విరుద్ధంగా చర్యలు తీసుకోవాల్సిన సదరు టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారులకు వంతపాడుతూ అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు కోకొల్లలు. అదే నిజం కాకుంటే చర్యలెందుకు తీసుకోరు అని ప్రశ్నిస్తున్నారు సామాజిక కార్యకర్తలు. జగద్గిరిగుట్ట, మైసమ్మ నగర్, శిరిడీ హిల్స్, కైలాస్ హిల్స్, కైసర్ నగర్, ద్వారక నగర్, గాజులరామారం ప్రాంతాల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలే అందుకు నిదర్శనం. సర్కిల్ పరిధిలో వెలుస్తున్న అనుమతుల్లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కొందరు స్థానికులు పలుమార్లు మై జీహెచ్ఎంసీ, ప్రజావాణి, లిఖితపూర్వక పిర్యాదులు చేస్తున్నా మొద్దు నిద్రను వీడని కొందరు లంచగొండి అధికారులు కుంటి సాకులు చెబుతూ నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్ లతో సరిపెడుతూ.. తమ విధులనే మర్చిపోతున్నారు. అందుకు ప్రత్యక్ష నిదర్శనం.. గాజులరామారం రాంకీ మార్వెల్ ముందు రఫీ నిర్మించిన సెల్లార్ భవన నిర్మాణం, భవన నిర్మాణానాన్ని సీజ్ చేసినా పూర్తి చేసిన సురేంద్ర పట్టుదల. ఇలా చెప్పుకుంటూ పోతే.. సవా లక్ష అంటూ అవినీతి అధికారులపై మండిపడుతున్నారు స్థానిక ప్రజలు.

**జగద్గిరిగుట్ట, మైసమ్మ నగర్లో..**

అంజయ్య నగర్ (మైసమ్మ నగర్ 'ఏ' బ్లాక్) లో రోడ్డు నంబర్ 3 లో బహుళ అంతస్తుల భవన నిర్మాణం చేపడ్తున్న అక్రమ నిర్మాణదారుడు ఏకంగా జగద్గిరిగుట్ట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ భూములనే కబ్జా చేశాడు. జగద్గిరిగుట్ట వాటర్ వర్క్స్ కార్యాలయం ముందున్న ఆలయ భూములను ఆక్రమించి అందులో కంకర, ఇటుక, సలాకులు వేసి మరీ తన అయిదు అంతస్తుల భవన నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడు. జీహెచ్ఎంసీ అనుమతులకు విరుద్ధంగా భవన నిర్మాణం చేపట్టడమే కాకుండా ఆలయ భూములను ఆక్రమించడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఎలాంటి సెట్ బ్యాక్ లు లేకుండా, సరైన అనుమతులు పొందకుండా నిర్మిస్తున్న ఈ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ వినిపిస్తుంది. జగద్గిరిగుట్ట మైసమ్మ నగర్ 'ఎ' బ్లాక్, వాటర్ వర్క్స్ కార్యాలయానికి ఎదురుగా 42-590/7/2 ఇంటి పక్కన వెలుస్తున్న బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాన్ని ఆపాలని, అనుమతులకు విరుద్ధంగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాన్ని వెంటనే కూల్చివేయాలని స్థానిక ప్రజలు సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం శూన్యంగానే మిగిలింది. శీను నిర్మిస్తున్న అయిదు అంతస్తుల భవన నిర్మాణానికి అక్రమంగా.. ఎలాంటి అనుమతులు లేకుండా పక్కనే ఉన్నటువంటి కరెంటు స్తంబాన్ని తొలగించి, అయిదు ఫీట్ల రోడ్డు ఆక్రమించి నిర్మాణం కొనసాగిస్తున్నాడని గాజులరామారం సర్కిల్ టౌన్ ప్లానింగ్, డిప్యూటీ కమిషనర్ కు ఫిర్యాదులిచ్చినా పట్టించుకోవడం లేదు, ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు అంటూ జోనల్ కమిషనర్ ను ఆశ్రయించినా చర్యలు మాత్రం శూన్యంగానే మిగిలాయి. స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమంగా గడ్డి తినడానికి అలవాటుపడ్డారనడానికి ఇదొక చక్కటి సాక్ష్యం అంటున్నారు స్థానిక ప్రజలు. ఇకనైనా అనుమతుల్లేకుండా శీను నిర్మిస్తున్న సదరు బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని సీజ్ చేసి నిర్మాణదారుడిపై క్రిమినల్ కేసు నమోదు పలువురు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, శిరిడీ హిల్స్ రోడ్ నంబర్ 18, 17 లో వెలుస్తున్న అనుమతుల్లేని బహుళ అంతస్తుల భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


















# మా నాన్న.. ప్రణబ్ ముఖర్జీ

శర్మిష్ఠ ముఖర్జీ.. భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కూతురు. గతంలో ఢిల్లీ కాంగ్రెస్ నాయకురాలు కూడా. తన తండ్రి అనుభవాల ఆధారంగా ఆమె రాసిన 'ప్రణబ్, మై ఫాదర్' వివాదాస్పదమైంది. ఈ పుస్తకానికి తన మరణానంతరమే ఓ రూపం ఇవ్వాలని ప్రణబ్ షరతు పెట్టారట. ఆ కోరిక ప్రకారమే.. రెండేండ్లపాటు శ్రమించి ప్రతి వాక్యంలో తండ్రి హృదయాన్ని ఆవిష్కరించారు శర్మిష్ఠ. గ్రామీణ పశ్చిమ బెంగాల్‌లో జన్మించిన ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతి భవన్ వరకు సాగించిన ప్రస్థానాన్ని ఈ పుస్తకంలో వివరించారు. తన తండ్రి రాజకీయ జీవితంలో ఇందిరాగాంధీతో పనిచేయడం ఒక బంగారు అధ్యాయం అంటారామె. ఇందులో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీ స్నేహం గురించి కూడా ప్రస్తావించారు. పీవీ మరణానంతరం ఆయన పార్థివదేహాన్ని ఢిల్లీలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలోకి అనుమతించకపోవడం తన తండ్రిని ఎంతో బాధపెట్టిందని తెలిపారు. "రాహుల్ గాంధీ తన ఘనమైన వారసత్వానికి గర్విస్తాడు కానీ, అతనిలో నెహ్రూ, ఇందిర, రాజీవ్‌లో ఉండే సూక్ష్మబుద్ధి , రాజకీయ చతురత లోపించాయి" అని ప్రణబ్ వ్యాఖ్యానించారని ఈ పుస్తకంలో పేర్కొనడం కలకలం రేపింది. కాంగ్రెస్ బలోపేతం కావాలంటే పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం తప్పనిసరి అనేది ప్రణబ్ ఆకాంక్ష అంటారామె. ఈ పుస్తకంలోని అంశాలు వివాదాస్పదం అయితే కావచ్చు కానీ, ప్రణబ్ కూతురిగా శర్మిష్ఠ చిత్తశుద్ధిని, రాతలోని నిజాయతీని శంకించలేం.

# ఆకట్టుకోనున్న యాపిల్ వాచ్ స్పెషల్ ఎడిషన్

న్యూఢిల్లీ : యాపిల్ వాచ్‌లో కీలక మార్పులతో యూజర్లను ఆకట్టుకునేందుకు కంపెనీ కసరత్తు సాగిస్తోంది. 2024లో రానున్న యాపిల్ వాచ్‌లో స్టన్నింగ్ డిజైన్‌తో పాటు బీపీ మానిటరింగ్, స్లీప్ అప్నియా ట్రాకర్ వంటి రెండు కీలక హెల్త్ ఫీచర్లను ప్రవేశపెట్టనుందని బ్లూమ్‌బర్గ్‌కు చెందిన మార్క్ గుర్మన్ అంచనా వేశారు. తన న్యూస్‌లెటర్ ద్వారా రాబోయే టెక్ ఉత్పత్తులకు సంబంధించిన సమాచారం షేర్ చేసే గుర్మన్ తాజాగా యాపిల్ వాచ్ స్పెషల్ వెర్షన్‌కు సంబంధించిన వివరాలు ప్రస్తావించారు. వాచ్ యానివర్సరీ సందర్భంగా యాపిల్ న్యూ వెర్షన్‌ను తీసుకువస్తోంది. మరింత స్టైల్‌గా కనిపించేలా స్పెషల్ ఎడిషన్‌ను యాపిల్ తన కస్టమర్ల ముందుకు తీసుకువస్తుందని గుర్మన్ వెల్లడించారు. ఈ వాచ్ ప్రస్తుతమున్న వాచ్‌ల కంటే విభిన్నంగా కనిపిస్తుందని కస్టమర్లు ఈ క్రేజీ డివైజ్ కోసం ఆసక్తిగా వేచిచూస్తున్నారు. బీపీ రీడింగ్ చూపడంతో పాటు రక్తపోటుకు సంబంధించి సమస్యాత్మకంగా మారే మార్పులపై ఈ వాచ్ అలర్ట్ చేస్తుందని చెబుతున్నారు. ఇక నిద్రలో కొన్ని క్షణాల పాటు శ్వాస ఆగిపోయే పరిస్థితిని పసిగట్టి హెచ్చరించే ఫీచర్ యాపిల్ వాచ్ స్పెషల్ ఎడిషన్‌లో జోడించడంతో ఇది ప్రజలకు ఉపయోగకరమైన హెల్త్ పీచర్‌గా ఉపకరిస్తుందని చెబుతున్నారు.





# చలికాలంలో జుట్టు ఎక్కువగా రాలిపోతుందా?

మన ఒంటి మీద ఉన్నట్టే తలమీదా చర్మమే ఉంటుంది. సాధారణంగా చలికాలం చర్మం పగులుతుంది. తల చర్మం కూడా పొడిబారుతుంది. క్రమంగా పగిలి పెచ్చులుగా మారుతుంది. శీతకాలం చుండ్రు రావడమంటే ఇదే. ఆ పెచ్చులు చర్మం మీది తైల గ్రంథుల్ని మూసేస్తాయి. దీంతో, జుట్టు రాలుతుంది. తలకు తరచూ నూనె పెట్టడం వల్ల ఈ సమస్యను కొంతమేర నివారించవచ్చు. ఇక, శరీరం లోపలి నుంచి కూడా నూనెలను అందించేందుకు ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్ చాలా ముఖ్యం. వాల్‌నట్స్, అవిసె, గుమ్మడి గింజల్లాంటి వాటితోపాటు సాల్మన్ ఫిష్‌లో ఇందుకు పనికొచ్చే ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. పొరలుగా వస్తున్నదీ అంటే మృత చర్మం కిందే లెక్క. ఆ స్థానంలో కొత్త చర్మం ఏర్పడాలి. ఇందుకు ప్రొటీన్లు అవసరం. ఆ ప్రయత్నంలో కోడి మాంసం, చేపలు, పాలు, పాల ఉత్పత్తుల్లాంటి వాటితో పాటు దాల్ సూప్, పనీర్ సలాడ్ లాంటివి తీసుకోవచ్చు. విటమిన్-ఎ, ఫోలిక్ యాసిడ్, బి6, బయోటిన్ జుట్టు ఆరోగ్యానికి కీలకం. చర్మం మీది సెబాషియస్ గ్రంథి సీబమ్ అనే నూనెలాంటి పదార్థాన్ని తయారు చేస్తుంది. తద్వారా చర్మాన్ని తేమగా ఉంచుతుంది. దీని ఉత్పత్తిని పెంచేందుకు విటమిన్-ఎ ఎంతో సాయపడుతుంది. క్యారెట్, గుమ్మడి, పాలకూర, ఇతర ఆకుకూరలు, రంగుల కూరగాయల్లో ఇది ఉంటుంది. చర్మంలోని కొత్త కణాల పెరుగుదలకు ఫోలిక్ యాసిడ్ దోహదపడుతుంది. రకరకాల నట్స్, సోయా, ఆకుకూరల్లో ఈ ఫోలిక్ యాసిడ్ దొరుకుతుంది. చుండ్రును అరికట్టేందుకు విటమిన్- బి6 ఉపకరిస్తుంది. బియ్యం, గోధుమ, జొన్నలాంటి ధాన్యాలతో పాటు గుడ్డు పచ్చసొన, మటన్ లివర్‌లోనూ బి6 లభిస్తుంది. ఇక జుట్టు రాలడాన్ని అరికట్టడానికి బయోటిన్ సాయపడుతుంది. ఈ పదార్థం గుడ్డు, లివర్, సోయాలో ఉంటుంది. అవసరమైతే డాక్టర్‌ను సంప్రదించి బయోటిన్ సప్లిమెంట్లను వాడవచ్చు. కేశాలను సంరక్షించుకోవచ్చు.

# హ్యాపీ.. మానిక్యూర్!

క్రిస్మస్ సంబురాల్లో అలంకరణదే అగ్రస్థానం. తగ్గేదేలే అన్నట్టు ఉంటుంది అమ్మాయిల ముస్తాబు. అందులోనూ చేతిగోళ్ల సింగారింపులో రకరకాల థీమ్స్ వస్తున్నాయి. స్టార్స్, కేక్స్, క్యాండిల్స్, బెల్స్, క్రిస్మస్ తాత.. ఇలా అనేక బొమ్మలు గోటి మీదికి ఎక్కుతున్నాయి. వీటికి త్రీడీ ఎఫెక్ట్ కూడా ఇస్తున్నారు.





# సంపాదకీయం

## సవాళ్లు ఎవరి ప్రయోజనాల కోసం !

రాష్ట్రం విభజన జరిగి 12 ఏళ్ల కావస్తోంది. అంటే పుష్కరకాలం గడిచింది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో సాధించింది సున్నా. ఓ రకంగా చెప్పాలంటే విభజన వల్ల రాజకీయ పార్టీలు, కొందరు నేతలు బాగుపడ్డారు తప్ప ప్రజలు ఏ విషయంలోనూ బాగుపడలేదు. వారికి ఎలాంటి ఉపయోగం కలగలేదు. అయినా రాష్ట్రాలను బాగు చేయకుండా ప్రజలను మభ్యపెడుతూ సవాళ్లు విసురుకుంటూ..జనాలను మోసం చేస్తున్నారు. అక్కడ చంద్రబాబు, జగన్ సవాళ్లు, ఇక్కడ కెసిఆర్ బృందం, రేవంత్ బృందం పరస్పర సవాళ్లతో కాలం గడుపుతున్నారు. తామంతా మంచే చేశామని, పాలన బ్రహ్మాండంగా చేసామని ఇరు రాష్ట్రాల సిఎంలు, సిఎంలుగా పనిచేసిన వారు చెప్పుకుంటున్నారు. మధ్యలో రాండి చర్చిద్దాం..అంటూ సవాళ్లు విసురుకుంటున్నారు. ఉచిత పథకాలతో ప్రజలను బురిడీ కొట్టించడం తప్ప వీరు చేసిన పాలనలో గొప్పతనం ఏదీ లేదు. పైగా రెండు రాష్ట్రాలు అప్పుల్లో కూరుకుపోయాయి. ఉమ్మడి ఎపికన్నా విడిపోయాక రెండు తెలుగు రాష్ట్రాలు దగపడ్డాయి. ఇకపోతే తాజాగా కెసిఆర్ మరోమారు మీడియా ముందుకు రావడం, నదీజలాలపై మాట్లాడడం, సర్కార్‌కు సవాల్ విసరడంతో ఇప్పుడు మరోమారు తెలంగాణలో సవాళ్ల పర్వ నడుస్తోంది. కృష్ణా జలాల విషయంలో ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ పదేళ్ల పాలనలోనే తెలంగాణకు ఎక్కువ అన్యాయం జరిగిందన్న కాంగ్రెస్ ప్రభుత్వ వాదనగా ఉంది.. కృష్ణా జలాల్లో ఏపీకి 511 టీఎంసీలు (64 శాతం),తెలంగాణకు 299 టీఎంసీలు (36 శాతం) చాలని సంతకం పెట్టింది కేసీఆరే అని, ఆ సంతకంతో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాలకు మరణ శాసనం రాసిందీ ఆయనే అని రేవంత్ సర్కార్ విమర్శిస్తోంది. ఆ పాపానికి ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి. ఉమ్మడి రాష్ట్రం కంటే కేసీఆర్ సీఎంగా ఉన్న పదేళ్లలోనే తెలంగాణకు నీటి విషయంలో ఎక్కువ నష్టం జరిగింది. కాంగ్రెస్ హయాంలో ప్రారంభ మైన భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, పాలమూరు–రంగారెడ్డి, డిండి, ఎస్ఎల్‌బీసీ, సీతారామసాగర్, కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకం... ఇలా కృష్ణా నదిపై ఉన్న ఒక్క ప్రాజెక్టును కూడా పదేళ్లలో పూర్తిచేయలేకపోయారని విమర్శలు అందుకున్నారు. అసలు కృష్ణా, గోదావరి జలాల విషయంలో ఇప్పటివరకు ఎప్పుడేం జరిగింది? ఎవరేం చేశారు? అని చర్చించేందుకు జనవరి రెండో తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు పెడతామని, కేసీఆర్ రావాలి. చర్చలో పాల్గొనాలి. ఒకరోజు కృష్ణా జలాల మీద, మరో రోజు గోదావరి జలాలపై చర్చిద్దాం అని కూడా కరేవంత్ అంటున్నారు. తెలంగాణకు ద్రోహం చేసిందే కేసీఆర్ అని... అసెంబ్లీకి వస్తే ఆ ద్రోహిని నిలదీస్తామని కూడా సవాల్ విసిరారు. అంతేగాకుండా కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేరని, సభకు వచ్చి చర్చిస్తేనే ఉన్నట్లని వ్యాఖ్యానించారు. రోడ్డు మీద కాదు... అసెంబ్లీలో నీళ్లు–నిజాలపై చర్చిద్దామని సూచించారు. ఇక కెసిఆర్ వ్యవహార శైలి మరోలా ఉంది. కృష్ణాజలాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దొంగాటను, రెండేండ్ల కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను కేసీఆర్ ఏకరువు పెట్టారు. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ప్రజల జీవన్మరణ సమస్య అన్నారు.ప్రజలను ఏమార్చినంత సులువుగా పాలన చేయడం చేతిగాని విఫల నేత అని పరోక్షంగా రేవంత్‌పై విరుచుకుపడ్డారు. ఇంతకాలం నోరు తెరిస్తే చావు శకునాలు, నెత్తుటి కూతలు కూసిన బేతాళ మాటలను కేసీఆర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాలపై రెండేండ్ల నుంచి నేను మౌనం పాటించి చూసుకుంటూ వస్తున్నట్లు వెల్లడించారు. తప్పని పరిస్థితుల్లో ఇప్పుడు నేను బయలుదేరాను. ప్రజల మధ్యలో అటు కేంద్రాన్ని ఎక్స్‌పోజ్ చేస్తం. ఇటు రాష్ట్ర ప్రభుత్వాన్ని కచ్చితంగా ఎండగడుతం. చాలా పెద్ద ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతం అని ప్రకటించారు. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో గ్రామగ్రామాన సభలు పెడుతం. ప్రజా ఉద్యమాలు చేస్తం. పెద్ద బహిరంగ సభలు పెడుతం. బహిరంగ సభలకు నేను స్వయంగా అటెండ్ అవుతున్నా. ప్రజాక్షేత్రంలో ఈ ప్రభుత్వ నిష్క్రియా పరత్వాన్ని ఎండగడుతం అని కేసీఆర్ ప్రకటించారు.మా హయాంలో ఈ రాష్ట్రం ఒక పద్ధతి ప్రకారం ముందుకు నడిచింది. సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామికం, ఐటీ రంగం, క్రైమ్ తగ్గింపు, లాండ్ అండ్ ఆర్డర్ నిర్వహణలో మంచి పద్ధతిలో ముందుకు పోయింది. ఇప్పుడు మానభంగాలు, నడి రోడ్డుపై హత్యలు జరుగుతున్నా అడిగే దిక్కులేదు. అప్పుడు పీస్ ఫుల్ స్టేట్ ఉండె.. ఇప్పుడవన్నీ మాయమై నయని అన్నారు. యూరియా సప్లయ్ చేసే తెలివి లేదా వీళ్లకు? మా గవర్నమెంట్ ఉన్నప్పుడు రైతులు ఆటోకు డబ్బులిచ్చి పది బస్తాలు తెచ్చియ్యి బాబూ అంటే.. తెచ్చి ఎకడో పొలంకాడ పడేస్తుండె. ఇవ్వాల రైతులు రోజుల తరబడి లైన్లలో చెప్పులు పెడుతున్నరు. రాష్ట్రం ఏర్పడక ముందు చెప్పుల లైన్లు ఉండె. బీఆర్ఎస్ ఉన్నన్ని రోజులు చెప్పుల లైన్లు మాయమైనయ్. కాంగ్రెస్ రాగానే మళ్లీ చెప్పుల లైన్లు స్టార్ట్ అయినయ్ అంటూ విమర్శలు సంధించారు. ఎంతసేపు రియల్ ఎస్టేట్ దందా తప్ప పాలమూరుకు రెండేండ్ల నుంచి రూపాయి పెట్టలేదు. తట్టెడు మట్టి తీయలేదు. వెనుక ఎవరి ఒత్తిడి ఉన్నది? ఎవరి ప్రయోజనాలు కోరుతున్నట్టు అని నిలదీసారు. 10 టీఎంసీలకు మా గవర్నమెంట్ ప్రాజెక్టు కోసం డీపీఆర్ పంపింది. ఇప్పుడేమో ఆ డీపీఆర్ తిప్పి పంపించిండ్రు.. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటం చేతకాకపోతే, రాష్ట్రానికి వస్తున్న నీళ్లను కూడా కాపాడే పరిస్థితి లేకపోతే.. ఇదేం దద్దమ్మ ప్రభుత్వం? కేంద్రం మొత్తం డీపీఆర్ పంపిస్తే ప్రాజెక్టుని ఆగం చేసే పరిస్థితి వస్తే.. వీళ్ల నుంచి సప్పుడులేదంటూ కెసిఆర్ తనదైన శైలిలో విరుచుకు పడ్డారు. మొత్తానికి ఇప్పుడు పరస్పర సవాళ్లు తప్ప పాలనపై ఎలాంటి సూచనలు లేవు. మధ్యలో ప్రజలు ఆగమవుతున్నారు. రాష్ట్రం అప్పులపాలు అవుతోంది. ఇదంతా నాయకత్వ లోపంగానే చూడాలి. ఇందులో గతంలో పాలించిన, ఇప్పుడు పాలిస్తున్న వారే బాధ్యులు. అప్పుల గురించి చర్చించాలి. నీటి వాటాలపైనా చర్చించాలి. అయితే మేధావుల సమక్షంలో అసెంబ్లీ బయట చర్చిస్తే మంచిది.

# రన్‌వై పై నేల పై కూర్చుని పరీక్ష



### ఒడిషా ఘటనపై సోషల్ మీడియాలో వైరల్

భువనేశ్వర్,డిసెంబర్22 : ప్రభుత్వ ఉద్యోగం కోసం వేలాది మంది అభ్యర్థులు ఎయిర్‌పోర్ట్ రన్‌వైపై నేలపై కూర్చుని పరీక్ష రాశారు. రన్‌వేపై పరీక్షా అని ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఇటీవల ఒడిశాలో జరిగిన ఈ ఘటన సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. హోంగార్డు ఉద్యోగం కోసం అభ్యర్థులకు పరీక్ష రాసేందుకు ఒడిశా ప్రభుత్వం సంబల్‌పూర్ జిల్లాలోని జమర్‌పాలి రన్‌వేను కేటాయించారు. డెస్కులు, మ్యాట్‌లు వంటి కనీస సౌకర్యాలు లేకుండా 8,000మందికి పైగా అభ్యర్థులు రన్‌వేపై కూర్చుని పరీక్ష రాశారు. అభ్యర్థులను పర్యవేక్షించేందుకు డ్రోన్‌లను వినియోగించడం గమనార్హం. వివరాల ప్రకారం.. సబల్‌పూర్ జిల్లాలోని 24 పోలీస్‌స్టేషన్‌లలో హోంగార్డు పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టులకు కనీస అర్హత 5వ తరగతి ఉత్తీర్ణత. కేవలం 187 పోస్టుల కోసం జిల్లా వ్యాప్తంగా 8,000మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఎంబిఎ, ఎంసిఎ, గ్రాడ్యుయేట్లు, ఇంజనీర్లు, డిప్లమో, ఐటిఐ శిక్షణ పొందిన అభ్యర్థులతో పాటు కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ పొందిన వారు కూడా ఉన్నారు. అభ్యర్థులను ఉదయం 6.00గంటలకు రిపోర్ట్ చేయాలని అధికారులు ఆదేశించారు. అయితే ఉదయం 9.00 గంటలకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడ్డారు. ఉదయం 10.30గంటలకు ప్రశ్నాపత్రాలను పంపిణీ చేయబడ్డాయి. 50మార్కుల ప్రశ్నాపత్రంలో 20 మార్కులకు పేరా రైటింగ్, 30 మార్కులకు జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు ఉన్నాయి. ముగ్గురు అదనపు సూపరింటెండెంట్లు, 24మంది ఇన్స్పెక్టర్లు, 86మంది సబ్‌ఇన్స్పెక్టర్లు, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లతో పాటు వందమందికి పైగా హోమ్ గార్డులు, ట్రాఫిక్ సిబ్బందిని అభ్యర్థులను పర్యవేక్షించారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగ సమస్యకు ఈ ఘటన నిదర్శనమని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఉపాధి కల్పనలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందని మండిపడ్డాయి.

# అసోం రాజధాని గౌహతిలో శ్రీవారి ఆలయం

### 25 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం అనుమతి

తిరుమల,డిసెంబర్ 25 : కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి వైభవాన్ని ఈశాన్య భారతదేశంలో మరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. గువాహటి నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రం నిర్మాణం సాకారం కానుంది. అసోంలో అద్భుత దేవాలయ నిర్మాణానికి అక్కడి ప్రభుత్వం సహకారం అందించనుంది. ఆలయ నిర్మాణానికి తొలుత నిర్ణయించిన 10.8 ఎకరాల భూమికి బదులుగా 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం నిర్ణయించింది. అస్సాం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన సంప్రదింపుల అనంతరం ఈ కీలక నిర్ణయం వెలువడింది. గువాహటి సమీపంలోని కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో 10.8 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం గతంలోనే అంగీకారం తెలిపింది. అయితే డిసెంబర్ 7న అస్సాం ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి కేకే ద్వివేది టీటీడీ ఛైర్మన్‌కు లేఖ రాస్తూ గువాహటిలోని గర్చుక్ ప్రాంతంలో ఇప్పటికే ఉన్న శ్రీవారి ఆలయం మరియు సాంస్కృతిక సముదాయం నిర్వాహకుల సూచనలను ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో టీటీడీ శ్రీ వేంకటేశ్వర ఆలయం నిర్మిస్తే, అక్కడ ఉన్న ఆలయ ప్రయోజనాలకు భంగం కలగవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని అస్సాంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సిల్చార్ లేదా డిబ్రూగఢ్ నగరాల్లో ఏర్పాటు చేయాలని అస్సాం సీఎం అదనపు ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ విషయాన్ని టీటీడీ ఛైర్మన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన ఈనెల 18న అస్సాం ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మకు లేఖ రాశారు. దేశంలోని ప్రతి రాష్ట్రం మరియు కేంద్రపాలిత ప్రాంతంలో కనీసం ఒక శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని స్థాపించడం ద్వారా హిందూ సనాతన ధర్మం, శ్రీ వేంకటేశ్వర స్వామివారి మహిమను విస్తరించాలన్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు టీటీడీ నిబద్ధతగా ఆ లేఖలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని అమరావతిలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 25 ఎకరాల భూమిని కేటాయించిన విషయాన్ని అస్సాం ముఖ్యమంత్రికి గుర్తు చేస్తూ, సిల్చార్ లేదా డిబ్రూగఢ్ బదులుగా అస్సాం రాజధాని గువాహటిలోనే టీటీడీకి 25 ఎకరాల భూమి కేటాయించాలని సీఎం చంద్రబాబు కోరారు. ఈశాన్య భారతదేశానికి గువాహటి ప్రధాన కేంద్రంగా ఉన్నందున, భక్తుల సౌకర్యాలు, నిత్య అన్నదానం వంటి ధార్మిక కార్యక్రమాలతో కూడిన దివ్యక్షేత్రాన్ని ఏర్పాటు చేయడానికి సుమారు 25 ఎకరాల భూమిని కేటాయించాలని సిఫార్సు చేశారు. అలాగే ప్రతిపాదిత స్థలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అస్సాం ప్రభుత్వం ఆర్థిక సహకారం కూడా అందించాలని ఏపీ సీఎం తన లేఖలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చేసిన సూచనలకు సానుకూలంగా స్పందించిన అస్సాం ముఖ్యమంత్రి గువాహటిలోనే టీటీడీకి 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. అలాగే ప్రతిపాదిత ప్రాజెక్టు అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా అందించేందుకు అంగీకరించారు. ఈ అంశాన్ని సౌహార్దపూర్వకంగా పరిష్కరించినందుకు ఆంధ్రప్రదేశ్ , అస్సాం రాష్ట్రాల ముఖ్యమంత్రులకు టీటీడీ ఛైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. భూమి కేటాయింపునకు సంబంధించిన విధివిధానాలను పూర్తి చేసి, ఈశాన్య భారతదేశంలో తొలి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించేందుకు అస్సాం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటామని తెలియజేశారు.

# ఉక్రెయిన్ డ్రోన్ దాడిలో దెబ్బతిన్న రెండు నౌకలు

### రష్యా అధికారుల ధృవీకరణ

మాస్కో,డిసెంబర్22 : ఉక్రెయిన్ డ్రోన్ దాడిలో రెండు నౌకలు దెబ్బతిన్నట్లు రష్యా అధికారులు సోమవారం తెలిపారు. డ్రోన్ దాడిలో రెండు పిల్లర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, నౌకల్లో మంటలు చెలరేగాయని అన్నారు. రష్యాలోని క్రాస్నోడార్ ప్రాంతంలోని నల్లసముద్ర తీరంలో ఉన్న వోల్నా గ్రామంపై ఉక్రెయిన్ డ్రోన్‌లతో విరుచుకుపడిందని క్రాస్నోడార్ ప్రాంతానికి చెందిన కార్యనిర్వాహక ప్రధాన కార్యాలయం టెలిగ్రామ్‌యాప్‌లో పేర్కొంది. నల్లసముద్రంలోని వోల్నా టెర్మినల్ వద్ద ఉన్న నౌకల్లోని సిబ్బందిని సురక్షితంగా ఖాళీ చేయించామని తెలిపింది. డ్రోన్ దాడితో 1,500 చదరపు మీటర్ల వరకు మంటలు వ్యాపించాయని, స్థానిక కాలమానం 2.00 గంటలకు కూడా మంటలు అదుపులోకి రాలేదని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ తరచుగా క్రాస్నోడార్ ప్రాంతంపై విరుచుకుపడుతోందని రష్యా ఆర్మీ తెలిపింది. శుద్ధి కర్మాగారాలు, ఇంధన గిడ్డంగులు, ఓడరేవులు మరియు వైమానిక స్థావరాలను లక్ష్యంగా డ్రోన్లతో దాడి చేస్తోందని పేర్కొంది.నల్లసముద్ర ప్రాంతం రష్యా ఇంధన ఎగుమతులు మరియు సైనిక వ్యూహాలకు ముఖ్యమైన కేంద్రంగా ఉంది. క్రిమియా సరిహద్దులో, దక్షిణ ఉక్రెయిన్‌లోని డ్రోన్ పరిధిలో ఉంది. నల్లసముద్ర ప్రాంతంలోని వోల్నా గ్రామం రష్యాకు కీలకం. ఇది 2014లో ఉక్రెయిన్ నుండి విలీనం చేయబడిన క్రిమియన్ ద్వీపకల్పానికి ప్రధాన భూభాగాన్ని అనుసంధానిస్తుం డటంతో పాటు కెర్చ్ జలసంధిపై ఉన్న క్రిమియన్ వంతెనకు దగ్గరగా కూడా ఉంటుంది.





# రాజధాని గ్రామాల్లో మౌళిక సదుపాయాలు

### పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి

గుంటూరు,డిసెంబర్ 25(ఆర్ఎన్ఎ):జనవరి నుంచి రాజధాని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు జరుగుతాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ చెప్పారు. మండలంలోని వడ్డమానులో రూ 98.7 లక్షలతో నిర్మించిన రోడ్డును మంత్రి సోమవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ? అమరావతి రాజధాని ప్రపంచంలో టాప్ 5 లో ఉండేలా నిర్మిస్తున్నామన్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములిచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. రాజధానిలోని 29 గ్రామాల్లో జనవరి నుంచి మౌలిక వసతుల పనులు చేపడతామని మంత్రి నారాయణ చెప్పారు. అన్ని గ్రామాల్లో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వరద నీటి కాలువలు, వీధి లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్, స్పోర్ట్స్ సిటీ, రైల్వే లైన్, రైల్వే ట్రాక్ కోసం ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు తీసుకుంటామని మంత్రి మరోసారి స్పష్టం చేశారు.

# ఈజీవితం బుద్బుతప్రాయం !

తిరుమల : మానవ జన్మ ఎక్కువ కాలం ఉండదు. ఈజీవితం బుద్బుతప్రాయం. ఇలాంటి జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలి. ఆదర్శంగా జీవితం గడపాలి. ఉన్న కాలాన్ని సక్రమంగా వాడుకోవాలి. 'దుర్లభో మానుషోదేహః' శరీరం లభించడమే చాలా కష్టం, 'దేహినాం క్షణ భంగురః' లభించినది ఒక క్షణమంత కూడా ఉండదు. 'మిన్నిన్ నిలయిల మన్ను ఇఱాక్కైగళ్' అని చెబుతారు నమ్మాళ్వార్. ఇది మెరుపు కంటే కూడా ప్రమాదకరమైనది. మెరుపు ఎట్లా ఐతే పోయేదో, ఆ వెలుతురును పట్టించుకోం, అట్లానే శరీరం పోయేది అని తెలిసి కూడా దానికోసం ఎన్ని తప్పుడు పనులు చేస్తున్నారే! పోయేదే అయినా ఇది పోయేది అని అనుకోనివ్వటం లేదు. కేవలం శరీరంకోసం బ్రతుకుతున్నాం అంటే ఇది ఎంత ప్రమాదమైనదో గుర్తించాలి. తెలియని శత్రువువంటిది అని చెబుతాడు నమ్మాళ్వార్. మెరుపు పోతుందని తెలుసు మనం వాడుకోం, అందుకే ఆ మెరుపే నయం. ఇట్లాంటి స్థితిలో మనం ఎన్నో జన్మలలో ఒకసారి మనిషి అయినప్పుడు దైవాన్ని గురించి ఆలోచించి, ఆ జ్ఞానాన్ని ఇచ్చే మహానుభావులని విశ్వసించి వారికి తగినట్లు బ్రతికగలిగితే, అట్లాంటి జన్మ కోటికి ఒకటైనా ఉంటుందో లేదో అని చెప్పవచ్చు. 'తత్రాపి దుర్లభం మన్యే వైకుంఠ ప్రియదర్శనం' మానవ జన్మలభించడమే గొప్ప అంటే, అట్లాంటి మానవ జన్మలో దైవాన్ని గుర్తించి బ్రతకడం, వైకుంఠ ప్రియులైన వారి దర్శనం లభించడం, వారి అభిమానం పొందటం ఎంత కష్టమో అనేది ఋషివాక్కు!! పరాశర మహర్షి వంటి వారికే అట్లా అనిపిస్తే ఇక మన గురించి ఆలోచించాలి. ఇవన్నీ మనిషికి చెప్పాల్సొచ్చింది, అది చెప్పడానికే రామావతారం. పురాణాలు, ఇతిహాసాలు అన్నీ మానవుడు సన్మార్గంలో నడవడానికి ఉపయోగపడేవే. వాటిని చదివి ఆ మార్గంలో పయనించినప్పుడే మానవ జన్మకు సార్థకత ఉంటుంది.





# సినిమా వదిలేస్తానని ఏడ్చేశా : నటి ఇలియానా


'దేవదాసు' అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయిన ఇలియానా బ్యూటీ- తన అందంతో , నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. దాంతో ఈ మూవీ తర్వాత నుంచి ఈమెకు అదిరిపోయే రేంజ్ క్రేజీ సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. కానీ ఇండస్ట్రీలో హీరోయిన్ ల కెరీర్ గురించి తెలియంది కాదు.. అవకాశాలు వచ్చినట్లే వచ్చి ఆగిపోతాయి. ఇలియాన విషయంలో కూడా ఇదే జరిగింది. దీంతో ఈ అమ్మడు బాలీవుడ్ లోకి ఎంట్రీ- ఇచ్చి అక్కడ కూడా మంచి క్రేజ్ సంపాదించుకుంది. ప్రజంట్ ఇండస్ట్రీకి దూరంగా ఉండి.. తల్లి మాతృత్వాన్ని ఆస్వాదిస్తోంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఇలియానా సినీ ప్రయాణంలో ఒక కీలక మలుపు గురించి పంచుకుంది.. సినీ రంగం బాహ్యంగా గ్లామరస్‌గా కనిపించినా, వాస్తవానికి చాలా ఒత్తిడులు, భావోద్వేగాలతో కూడి ఉంటుంది. ముఖ్యంగా 'దేవదాసు' సినిమా -టైమ్‌లో ఎదుర్కొన్న కష్టం ఎప్పటకి మర్చిపోలేను. ఫస్ట్ సినిమా కావడం వల్ల, సెట్స్‌లో కొత్త వాతావరణం, భాష, వర్క్ కల్చర్ వల్ల ఒత్తిడి ఎక్కువయ్యింది. దీంతో మా అమ్మకి ఫోన్ చేసి 'సినిమా వదిలేస్తానని' ఏడ్చిన.. ఆ సమయంలో తల్లి ధైర్యం చెప్పడం వల్లే ఆమె ఆ సినిమాను పూర్తి చేయగలిగాను. ఈ సంఘటన నా జీవితాన్ని మార్చేసింది. అదే సినిమా నన్ను స్టార్ గా నిలిపింది.ఒత్తిడిలోనూ ధైర్యంగా ముందుకెళ్లడం ఎంత అవసరమో,మన కుటు-ంబ సభ్యుల మద్దతు కూడా అంతే ముఖ్యం' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ అమ్మడు మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.






# 24న మైసా ఫస్ట్ గ్లింప్స్ విడుదల

కన్నడ భామ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న ప్రాజెక్ట్ మైసా. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో వస్తోన్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. రష్మిక మందన్నా ఇదివరకెన్నడూ కనిపించని నయా అవతార్‌లో కనిపించనున్నట్టు హింట్ ఇచ్చేశారు మేకర్స్. తాజాగా మరో క్రేజీ వార్తను షేర్ చేశారు. మైసా ఫస్ట్ గ్లింప్స్‌ను డిసెంబర్ 24న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళగా కనిపించనుందని పోస్టర్లతో తెలుస్తోంది. మైసా సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీకి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పుష్ప ఫ్రాంచైజీలో శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో పాన్ ఇండియా మార్కెట్‌ను షేక్ చేసిన రష్మిక మందన్నా మరి గోండు గిరిజన మహిళగా ఎలా మెప్పించబోతున్నదన్నది ఆసక్తి రేకెత్తిస్తోంది.ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తుండగా.. కల్కి 2898 ఏడీ చిత్రానికి పనిచేసిన ఆండీ లాంగ్ గ్యుయెన్ స్టంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడని ఇన్‌సైడ్ టాక్. ఈ డెబ్యూ డైరెక్టర్ ఇటీవలే మైసా నుంచి రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్ లాంచ్ చేసి హైప్ క్రియేట్ చేస్తున్నాడు. కేరళలోని అథిరప్పిల్లీలో షూటింగ్ షురూ అయినట్టు ఇప్పటికే మేకర్స్ అప్‌డేట్ అందించారు.




# రజనీకాంత్ 50 ఏళ్ల సినీ ప్రస్థానం

## మరోమారు విడుదలైన వడియప్ప

## థియేటర్‌కు వెళ్లి చూసి థ్రిల్ అయిన రమ్యకృష్ణ

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ కెరీర్‌లోనే ఎవర్ గ్రీన్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన చిత్రం 'పడయప్ప' తెలుగులో 'నరసింహ'మరోసారి ప్రేక్షకులను అలరిస్తోంది. రజనీకాంత్ 50 ఏళ్ల సినీ ప్రస్థానం పూర్తయిన సందర్భంగా ఈ చిత్రాన్ని ఈ నెల 12న థియేటర్లలో రీ రిలీజ్ చేశారు. 1999లో విడుదలైన ఈ సినిమా అప్పట్లో బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించింది.రజనీకాంత్ సరసన సౌందర్య, రమ్యకృష్ణ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో ముఖ్యంగా నీలాంబరి పాత్ర సినీ చరిత్రలో నిలిచిపోయింది. ఆ పాత్రకు ప్రాణం పోసిన రమ్యకృష్ణ నటన ఇప్పటికీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. రీ రిలీజ్ సందర్భంగా తాజాగా రమ్యకృష్ణ స్వయంగా థియేటర్లో 'పడయప్ప'ను వీక్షించారు. దీనికి సంబంధించిన వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ 'ఫస్ట్ టైమ్ 'పడయప్ప' మూవీని థియేటర్లో చూశాను' అని పేర్కొన్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో రజనీకాంత్ ? రమ్యకృష్ణ మధ్య వచ్చే సీన్స్ ఇప్పటికీ అభిమానులకు ప్రత్యేకం. ముఖ్యంగా నీలాంబరి అజ్ఞాతవాసం ముగించుకుని, చాలా ఏళ్ల తర్వాత 'నరసింహ'ను ఎదుర్కొనే సీన్ సినీ చరిత్రలోనే ఐకానిక్‌గా నిలిచింది. డైలాగ్స్, బీజీఎం, ఇద్దరి నటన థియేటర్లో మరోసారి గూస్‌బంప్స్ తెప్పించాయి. ఆ సీన్ వచ్చిన సమయంలో థియేటర్లో ఫ్యాన్స్‌తో కలిసి రమ్యకృష్ణ కూడా ఆ క్షణాలను ఆస్వాదించారు. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతూ, 'నీలాంబరి ఇస్ నాట్ జస్ట్ ఎ క్యారెక్టర్? ఇట్'స్ ఎ లెజెండ్' అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.



# నార్త్‌లో అఖండ-2 విడుదల

హిందీ ఆడయిన్స్ స్పందన అంతంత మాత్రమే టాలీవుడ్ సీనియర్ హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నటసింహం నందమూరి బాలకృష్ణలకు తెలుగులో ఉన్న స్టార్‌డమ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆరు పదుల వయసులోనూ తమదైన శైలితో ప్రేక్షకులను మెప్పిస్తూ, యంగ్ హీరోలకు గట్టి పోటీ ఇస్తూ వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. తెలుగులో వీరిద్దరికీ అశేషమైన అభిమాన గణం ఉండటంతో పాటు భారీ మార్కెట్ కూడా ఉంది. అయితే నార్త్ మార్కెట్ విషయానికి వస్తే చిరంజీవి, బాలకృష్ణలకు ఆశించిన స్థాయిలో ఫలితాలు దక్కడం లేదనే అభిప్రాయం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. మెగాస్టార్ చిరంజీవి స్వాతంత్ర్య పోరాట యోధుడి కథతో తెరకెక్కిన 'సైరా నరసింహ రెడ్డి' సినిమాతో నార్త్ ఆడియన్స్‌ను టార్గెట్ చేశారు. భారీ బడ్జెట్, పాన్ ఇండియా రిలీజ్, అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో నటించడం వంటి అంశాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. కానీ హిందీలో పెద్ద ఎత్తున రిలీజ్ చేసినప్పటికీ, సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. వసూళ్లు పరిమితంగానే నమోదయ్యాయి. ఆ తర్వాత మలయాళ సూపర్ హిట్ 'లూసిఫర్' రీమేక్‌గా తెరకెక్కిన 'గాడ్ ఫాదర్' తో మరోసారి చిరంజీవి నార్త్ మార్కెట్‌లో తన అదృష్టాన్ని పరీక్షించారు. రాజకీయ నేపథ్యం, పవర్‌ఫుల్ పాత్ర ఉన్నప్పటికీ ఈ సినిమా కూడా హిందీలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఇదే సమయంలో నటసింహం బాలకృష్ణ కెరీర్‌లో భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'అఖండ' సినిమాతో నార్త్ ఆడియన్స్ దృష్టిని ఆకర్షించారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగులోనే కాదు, హిందీ డబ్బింగ్ వెర్షన్‌కి కూడా యూట్యూబ్, టీవీ ప్రసారాల ద్వారా మంచి ఆదరణ లభించింది.ఈ నేపథ్యంలో 'అఖండ 2: తాండవం' పై హిందీలో కూడా మంచి అంచనాలు ఏర్పడ్డాయి. సీక్వెల్ నార్త్ మార్కెట్‌లో క్లిక్ అవుతుందని ట్రేడ్ వర్గాలు భావించాయి. కానీ రిలీజ్ తర్వాత పరిస్థితి భిన్నంగా మారింది. హిందీ వెర్షన్‌కు థియేటర్లలో స్పందన నెమ్మదిగా ఉండటంతో వసూళ్లు నిరాశపరిచినట్లు సమాచారం. ఇప్పటివరకు కలెక్షన్లు కోటి రూపాయల మార్క్‌ను కూడా దాటలేదనే ప్రచారం జరుగుతోంది. దీంతో చిరంజీవి హిందీ సినిమాల కంటే బాలకృష్ణ సినిమా మరింత తక్కువ వసూళ్లు సాధించిందన్న చర్చ మొదలైంది. బాలీవుడ్ మార్కెట్‌లో 'అఖండ 2' విషయంలో అంచనాలు ఒకలా, ఫలితాలు మరోలా వచ్చాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రానున్న రోజులలో అయిన వీరు అనుకున్నది సాధిస్తారా అన్నది చూడాలి.



# అనీల్ రావిపూడి అదుర్స్

## ఎఐతో ప్రచార వీడియో వైరల్

సినిమా ప్రమోషన్ల విషయంలో దర్శకుడు అనిల్ రావిపూడి అనుసరిస్తున్న వైఖరి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. తనదైన పంథాలో కొత్త ఐడియాలను అప్లై చేస్తూ, ప్రతి సినిమాను విడుదలకు ముందే ట్రెండింగ్‌లో ఉంచడంలో అనిల్ దిట్ట. ప్రస్తుతం ఆయన మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు' విషయంలో కూడా ఇదే ఫార్ములాను ఫాలో అవుతున్నారు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ దగ్గర నుంచే వరుసగా క్రియేటివ్ ప్రమోషనల్ వీడియోలు రిలీజ్ చేస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నారు అనిల్. సినిమాతో సంబంధం ఉన్న ప్రతి అంశాన్ని ప్రమోషన్‌గా మార్చి వైరల్ చేయడంలో మరోసారి తన మార్క్ చూపిస్తున్నారు. లేటెస్ట్‌గా అనిల్ రావిపూడి ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీని కూడా తన సినిమా ప్రమోషన్స్ కోసం వినియోగించి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజాగా విడుదల చేసిన ఓ ప్రత్యేక వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. అలా నేను చూస్తూ పెరిగిన మెగాస్టార్ నుంచి? ఇలా నేను డైరెక్ట్ చేసే మెగాస్టార్ వరకు' అంటూ అనిల్ షేర్ చేసిన ఈ వీడియో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇందులో చిరంజీవి కెరీర్‌లోని క్లాసిక్ సినిమాలు.. ఖైదీ, గ్యాంగ్ లీడర్, ఘరానా మొగుడు, జగదేకవీరుడు అతిలోక సుందరి, ముఠామేస్త్రీ, అంజి, ఇంద్ర, శంకర్ దాదా ఎంబీబీఎస్, ఠాగూర్ వంటి చిత్రాల సెట్స్‌కు అనిల్ వెళ్లినట్టుగా ఏఐ వీడియోను రూపొందించారు. మెగాస్టార్‌తో కలిసి ఉన్నట్టుగా చూపిస్తూ తన అభిమానాన్ని వినూత్నంగా ఆవిష్కరించారు. వింటేజ్ చిరుని పరిచయం చేస్తూ రూపొందించిన ఈ వీడియో మెగా అభిమానులను సర్‌ప్రైజ్ చేస్తోంది. నెట్టింట ఈ వీడియోకు భారీ స్పందన వస్తుండగా, అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. అదే సమయంలో కొంత మంది నెటిజన్లు మాత్రం 'అనిల్ ప్రమోషన్ స్టాట్రజీ మామూలుగా లేదు? సినిమా కోసం ఏదీ వదలడం లేదుగా' అంటూ కామెంట్లు చేస్తున్నారు.

Navataram Telugu Daily Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747,
Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State
Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com